# జ్ఞానోదయం

రచన :
'మణిశ్రీ సత్య'

ఉదయం నిద్ర లేవగానే అదోలా వుంది. ఏదో చేయాలన్న భావనే కాని ఏం చేయాలో "యిదమిద్ధ"మని తెలియటం లేదు. ఆ రోజు ఆదివారం ఆఫీస్‌కి వెళ్ళనవసరం లేదన్న సంతోషం యెంతోసేపు వుండలేదు నాకు. ఏం చేయాలో తోచక విసుగెత్తి "ఆఫీస్‌కి పోతేనే బావుంటుంద"నిపించిన ఆదివారాలు చాలా వున్నాయి — పెళ్ళయిన కొత్తలో తప్ప! అందుకే కాబోలు కొంతమంది ఫైళ్ళు తెప్పించుకుంటుంటారు. సెలవుల్లో కూడా. రొటీన్ అనే వాట్లో మార్పులు, చేర్పులు, చిన్నవైనా, పెద్దవైనా సరే, యిబ్బందిగానే వుంటాయి. ఏ పనీ లేకుండా ఖాళీగా కూర్చోవటమే అన్నిటికంటే కష్టమైన పని!

లేచి పెట్టె తెరిచాను — అప్రయత్నంగా. అట్టడుగు నున్న గులాబి రంగు కవరు బైటికి తీశాను. సీలు చేసి వుంది. నా పెళ్ళికి రెండ్రోజులు ముందు వేసిన సీలు అది. నాలుగేళ్ళయిందిప్పటికి. అందులో పెద్దగా చెప్పుకోదగిన విలువగల డాక్యుమెంట్స్ ఏమీ లేవు. కాని నాకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఉత్తరాలున్నాయి. ఊసుపోనప్పుడు పాత ఉత్తరాలు పైకి తీసి చదవటం నాకో అలవాటు, చాలా యిష్టమైన పనికూడా.

డియర్ శేఖర్‌గారూ,

నమస్తే.

నాపై మీకుగల అభిమానానికి ముందు నా ధన్యవాదాలు స్వీకరించండి.

మీ దగ్గరనుండి యిలాంటి ఉత్తరం వస్తుం దని నేనెన్నడూ అనుకోలేదు. 'సీతత్తగారింటి కెళ్ళి యేవైనా పుస్తకాలు తెచ్చిపెట్టవే' అని చెల్లాయిని పంపేనొకసారి. పుస్తకాలతో తిరిగి వచ్చింది. కాని అవి సీతత్తగారివి కావు. పేరు చూశాను. శేఖర్, ఎమ్. ఏ. (ఫైనల్) అని వ్రాసి వుంది. "ఎవరిచ్చారే ఈ పుస్తకాలు?" అన్నాను చెల్లితో.

"సీతత్తా వాళ్ళు ఆ వాటా ఖాళీ చేసేశారటక్కాయ్. కొత్తగా వచ్చినాయన యిచ్చాడిది. చాలా మంచాయనగా, పొడుగ్గా, నాజూగ్గా, నల్లగా..." అని పూర్తికాకపోతోంది మీ గురించి. బ్రేక్ వేశాను.

"ఏంటే అలా తెగ పొగిడేస్తున్నావ్ ఆ నవమన్మధుణ్ణి!" నా మాటలకి చెల్లాయికి సిగ్గు గుర్తొచ్చింది కాబోలు! నా ముందు నుంచి పారిపోయింది!!

ప్రతి పుస్తకం తెరవగానే మీ పేరు దర్శన మిచ్చేది. చెల్లి చెప్పిన రూపం నా ముందు మెదలి నన్ను పూరించేది. మిమ్మల్ని వెంటనే చూడాలని పించింది, పుస్తకాలనక్కడ పారేసి, వాకిట్లో మొక్కలకి నీళ్లు పోయటం ప్రారంభించాను... కనీసం ఒక్కసారైనా మీరు కంటపడక పోతారా అని.

"అదేమిటే వినూ, ప్రొద్దున్నే యేంటీ వెర్రి పని? ఆ మొక్కల్నలా బ్రతకనివ్వవల్లే వుంది. నిన్ననే కదా పది ముక్కలు కుండపోత వాన కురిసింది. యిప్పుడు పనిగట్టుకుని నీళ్లు పోస్తున్నావ్. యెండలు మండిపోయిన రోజుల్లో ఒక్కనాడూ నీకీ బుద్ధి పుట్టలేదు." మొక్కల్ని పెంచటం యిష్టమే నాకు. కాని, నూతి నీళ్లు చేది పోయాలంటే బద్ధకం. అందుకే అమ్మకంత ఆశ్చర్యం! అమ్మ అలా అని యింట్లోకి వెళ్ళి పోయింది. ఆమె వెళ్ళిపోగానే మీ గుమ్మం వైపు చూశా. నా వంక తదేకంగా చూస్తూ మీరు కనిపించారు. బొత్తిగా మొహమాటం లేకుండా అలా ఒకరినొకరు నిలబడి చూసుకోటం ఉభయులకూ మంచిది కాదని

యింట్లోని దొడ్డు తీగాన--మనసులో కదల బుద్ధి కాలేదు! 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటే యిదే కాబోలు ననుకున్నా. మర్నాడు వుత్తరం వ్రాశారు! ఎంత ధైర్యముందీ మీకు? ఆ వుత్తరం నాకంటే ముందు మా యింట్లో మరెవరైనా తెరచి వుంటే యేమయ్యేది?! ఆ రోజు రాత్రంతా కంటికి కునుకు లేదు - యింతకు ముందు అటువంటి ప్రేమ లేఖ అందుకోక!

ప్రేమించి పెళ్ళి చేసుకున్న వ్యవహారాల గురించి కథల్లో చదివాను, సినిమాల్లో చూశాను. కాని నా జీవితంలోనే యిట్లాంటి మలుపుంటుం దని వూహించలేదెప్పుడూ. అనుకోనిది, అనుకో నప్పుడు జరిగితేనే థ్రిల్! అదే నా కిష్టం. అర్థ మయిందనుకుంటాను. ధైర్యం చేసి యిలా వ్రాస్తు న్నందుకు నన్ను మీరు చులకన చేస్తే నేనది సహించలేను.

బి. ఏలో ఎకనమిక్స్ వుండిపోయింది - దాని తప్పేమీ లేదు లెండి! నేను సరిగ్గా చదవక, పాపం, అది వుండిపోయింది!! యింకా చదువు ప్రారంభించలేదు పరీక్షకు లోచ్చేస్తున్నా! కాని కంటే కథలు చదవటం అంటే యిష్టం నాకు.

మీ జాబు ఏమిటి? యెందుకని ప్రశ్నించక జాబు వ్రాయండి అవసరం వుంది దానితో. వెంటనే జాబు వ్రాస్తారని ఎదురు చూస్తుంటాను.

మీ వినత.

అది వినత నుండి నాకొచ్చిన మొదటి ప్రేమ లేఖ. ఆ రోజు, ఆమె నా ప్రేమ నంగీకరించిందన్న ఆనం దాన్ని లేఖలోని చివరి వాక్యాలు క్రూరంగా అపహ రించాయి. ఆమె కాకి అంటోంది. నేనసలు ఆమె కులానికే చెందను. బి. ఏ చదివినా ఆమె ఎదగలేదని పించింది, నిజాన్ని బయటపెట్టి ఆమె అనురాగాన్ని చేతులారా వదులులో బుద్ధి వేయలేదు నాకు కొద్ది రోజులవరకూ మిన్నకున్నాను జాబు వ్రాయకుండా.

అంతలోనే వినత నుండి రెండో వుత్తరం వొచ్చింది.

డియర్--

బావుంది, చాలా బావుంది! యింతలోనే అంత యిర్రెగ్యులర్ అయితే ఎట్లా? ప్రేమ వ్యవహారాల్లో సయితా కనీసం పంక్చువాలిటీ పాటించొద్దూ? వెంటనే వ్రాయండి అంటే యిన్నాళ్లు గప్ చిప్ గా వూరుకుంటారా? యికనైనా నా అంతరం అర్థం కాదా మీకు? నా మనసు మీ ముందుంచి చీప్ అయిపోయానేమోనన్న అనుమానం అప్పుడప్పుడూ నాలో ఆవిర్భవిస్తోంది.

నిన్న రాత్రి సినిమాకి వెళ్ళాం మేమంతా. సినిమా చూస్తున్నంత సేపూ మీరే గుర్తొచ్చారు. నా ప్రక్కనున్న సీట్లో పిన్ని బదులు మీరుండి వుంటే బాగుండుననిపించింది. ఆశ అప్పుడే తీరదని గుర్తొచ్చి నీరసం వచ్చింది!

యెన్నో వ్రాయాలని మనసులో వుంది. కాని, మీనుండి వినాలన్న ఆతంకంలో నేనేమీ వ్రాయ లేక పోతున్నాను. యిప్పుడైనా వెంటనే వ్రాస్తా రని తలుస్తూ,

"మీ వినత."

రెండో లెటర్ అందిన నాడు ఏం చేయాలో నాకర్థం కాలేదు. నా కులం గురించి నిజాన్ని వ్రాస్తే ఆమె ప్రేమని పొందలేనేమో?! ఆమె వివాహానికి అంగీక రించక పోవచ్చు. రహస్యంగా వుంచి ఆత్మ వంచన చేసుకోలేక పెద్ద వుత్తరం వ్రాశాను - కులాంతర వివా హానికి భయపడనవసరం లేదనీ, నా రెక్కల కష్టంపై తనని పోషించి సంతోష పెట్టగలననీ, నేను మోస గాడిని కానని, నన్ను నమ్మమని...యిలా కన్విన్సింగ్ వ్రాశాను.

మర్నాడు వినత నుండి వుత్తరం వొచ్చింది అదే ఆఖరి వుత్తరం ఆమె నుండి.

'.........,

నేను మీకు భార్యనవటం అసంభవం, నన్ను

మర్చిపోండి. నేను మిమ్మల్ని ఆ దృష్టితో ఎన్నడూ చూడలేను. అసలు నాకలాంటి వుద్దేశ్యం లేనేలేదు. మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. (బహుశా ఆమె ముందు ఏం వ్రాసిందో మర్చిపోయుండొచ్చు!) దయ చేసి మీరు అటువంటి ఆలోచన్ని దూరంగా తరిమెయ్యండి నామీద మీకు నిజంగా అభిమానం వుంటే నన్ను విసిగించొద్దు మీ వుత్తరాలతో. మీ మనసుకు బాధ కల్గిస్తే క్షమించండి.

ఉంటా,

.........”

అది నా ప్రేమ వ్యవహారంలో ఆఖరి వుత్తరం. నాకలం లేఖగా ఆమె ప్లేటు మార్చి తన హృదయం లోని నా స్థానాన్ని తుడిచేసింది! నేను ప్రాధేయ పడుతూ వ్రాసిన దానికి గాని, ప్రోత్సహిస్తూ వ్రాసిన దానికి గాని ఇక నా దారికి రాలేదు. ఆమె వ్రాసిన మొదటి రెండు వుత్తరాలకీ ఆఖరి వుత్తరానికీ అసలు సంబంధమే లేదు. మొదట డియర్ అని సంబోధించిన ఆమె ఆఖరి వుత్తరంలో చుక్కలతో సంబోధించింది! చుక్కలతోనే సంతకం చేసింది!!

కులాంతర వివాహం చేసుకునే ధైర్యం తనకులేదని ఇక వ్రాసివుంటే నేనెంతో సంతోషించే వాణ్ని. నిజం అంగీకరించే ఔన్నత్యం లేక వచ్చి ఉత్తరాలు వ్రాసింది. అదే నేను సహించలేనిది. చాలా రోజులాలోచించి, అర్థంకాక చివరికి ఇల్లు మార్చేశాను. పరీక్షలైన గానే నాన్నగారి పలుకుబడిమీద ప్రస్తుతం వెలగ బెడుతున్న ఉద్యోగంలో జాయినయ్యాను. నాన్నగారి ఇష్టప్రకారం లక్ష్మిని అర్థాంగిగా స్వీకరించి నాలుగేళ్ళయింది. ప్రేమలో విఫలమైన రోజుకి చాలాసార్లు గుర్తు కొచ్చేది. కాని, కొద్ది రోజుల్లో లక్ష్మి లాలనలో గతాన్ని మరచిపోయే స్థితి వచ్చాను. ఇప్పుడు ఇక ఎక్కడుందో...”

“అయ్యో రాత! ప్రొద్దున్నే ఆ కాగితాలు ముందేసు క్కూర్చున్నారేమిటండీ! శాస్త్రిగా సౌఖ్యం! మీ కంటే బుజ్జి నయం! అప్పుడే స్నానం చేసి, బట్టలు కట్టుకొని, ఆడుకోటానికి వెళ్ళింది. లేచి త్వరగా రండి. అసలే కాఫీ చల్లారిపోతోంది. మళ్ళీ వేడి చేసి ఇమ్మంటే కుదరదు.” శ్రీమతి యిచ్చిన వార్నింగ్ విని ఉలిక్కిపడి ఆలోచనలోంచి బయటపడ్డాను.

“పద, వస్తున్నా,” లక్ష్మిని అక్కడ్నుంచి పంపే శాను. ఆ వుత్తరాలు ఆమె చూసి వుంటే? నాపై పూర్తి విశ్వాసం వుంచి నన్నారాధిస్తున్న లక్ష్మిని ఒక రకంగా మోసం చేస్తున్నానేమోనన్న అనుమానం వచ్చింది. తాళి కట్టి ఒక స్త్రీ హృదయ పీఠాన్నలంకరించాక, పరాయి స్త్రీ గురించి ఆలోచించటంకూడా మోసమే అవుతుంది. నాలో నిద్రపోతున్న సిగ్గు తల ెత్తింది. నాకర్థంకాని వనితకి నా ఆలోచనల్లో స్థానం లేదు.

లేచి తిన్నగా కిచెన్‌లోకి వెళ్ళాను. కుంపటి మీద నీరు మరుగుతోంది. ఆ పాత్రను దించేను క్రిందికి. కొద్ది క్షణాల్లో గులాబి రంగు కవరు నల్లని మసిగా మారింది. ఎర్రని నిప్పుల్లో కాంతి.

తెల్లముఖం వేసి చూస్తోంది లక్ష్మి. నేనిప్పుడు ఆమెను మోసం చేయటం లేదన్నమాట. ధైర్యం చిక్కింది నాకు. అమాంతంగా ఓ ముద్దు పెట్టుకునేసరికి ముడుచుకు పోయింది సిగ్గుతో.

“పరగడుపు సరసాలు చాలుగాని, అదేమిటి అలా కాల్చేశారు? పనికి రావా కాగితాలు?” అమాయకంగా అడిగింది.

“పనికి మాలినవని కొద్ది నిముషాల క్రితమే అర్థమయింది.”

బ్రష్, పేస్ట్ తీసుకుని దొడ్లో నూతి దగ్గరికి దారి తీశాను. ఇక ఆలస్యం చేశానంటే ఆ ఆదివారం అంతా శ్రీమతిగారి చిరుబురులతో సరిపోతుంది! అది ఖాయం.

ఆ ఆదివారం ఓ మంచి పని చేసినట్లు ఓ సత్యాన్ని తెల్సుకున్నట్లు, నా డైరీలో వ్రాసుకున్నాను.